# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**18 జూన్, 2022**

## సైన్యాన్ని నాజీకరించే, పౌర సమాజాన్ని సైనికీకరించే కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక 'అగ్నిపథ్' పథకానికి వ్యతిరేకంగా పోరాడుదాం!

భారత సైన్య త్రివిధ బలగాలలోకి యువతను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ నూతన 'అగ్నిపథ్' పథకాన్ని, అందుకు వ్యతిరేకంగా పది రాష్ట్రాలకు వ్యాపించిన, బిహార్ రాష్ట్రంలో రైల్వేల ధ్వంసం మొదలయిన సంఘటనలతో జరుగుతున్న ప్రజల ఆందోళనలపై తెలంగాణా రాష్ట్రం సికిందరాబాద్ ప్రాంతంలో కాల్పులలో వరంగల్‌కు చెందిన రాకేష్ అనే వ్యక్తి మరణానికి, పలువురికి గాయాలకూ దారి తీసిన ప్రభుత్వ అణచివేత వైఖరినీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అత్యంత తీవ్రంగా ఖండిస్తున్నది. ఇది సైన్యాన్ని ఫాసిస్టీకరించే, పౌర సమాజాన్ని విచ్ఛిన్నం చేసి సైనికీకరించే పథకం.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భారతీయ జనతా పార్టీ మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన గడచిన 8 సంవత్సరాల రెండు దఫాల పాలనలో దేశంలో యావత్తు రంగాలనూ ఫాసిస్టీకరణ చేస్తూ వస్తున్నది. జూన్ 14వ తేదీన ప్రకటించిన, సైన్యంలోకి భర్తీ పథకంగా ముందుకు తీసుకువచ్చిన 'అగ్నిపథ్' ఉద్యోగ కల్పన పేరుతో దేశ ప్రజలపై ఫాసిస్టు అణచివేత సాధనమే.

ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాల వల్ల ప్రపంచంలోను, దేశంలోనూ రోజు రోజుకూ నిరుద్యోగం పెరుగుతున్నది. పర్మనెంటు ఉద్యోగాలు లేవు. ఈ పరిస్థితులలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'అగ్నిపథ్'లో చేరడం యువతను బలవంతంగా భర్తీ చేసుకోవడమే అవుతుంది. ఎల్‌పీజీలో భాగంగా, ప్రభుత్వ వ్యయాన్ని కనిష్టం చేయాలన్న ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి షరతులకు లోబడి జరుగుతున్నది. సైన్యంలో వేతనాలు, భారీ ఫించనుల ఖర్చును తగ్గించేందుకే ఈ 'టూర్ ఆన్ డ్యూటీ' పథకాన్ని తీసుకువచ్చామని ప్రభుత్వం బహిరంగంగానే ప్రకటించింది.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదుల మధ్య పోటీ సాయుధ ఘర్షణల రూపం తీసుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ముందుకు తీసుకువచ్చింది. అంతర్జాతీయ రాజకీయాలలో భారతదేశం ఎంత చురుకుగా వ్యవహరించబోతున్నదో ఇది తెలియజేస్తుంది. యుక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధ పరిణామాలలో ఇది ఒక భాగం. ఆర్థిక సంక్షోభం కారణంగా పెరుగుతున్న దైనందిన జీవిత సమస్యలతో ప్రజలలో పెరుగుతున్న అశాంతిని, కార్మిక, కర్షక, దళిత, ఆదివాసీ, జాతుల పోరాటాలను అణగదొక్కడానికి, ప్రత్యేకంగా భారతదేశంలో వర్గ పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని నిర్మూలించడానికీ ప్రభుత్వం అత్యంత కుట్రపూరితంగా ఈ పథకం ముందుకు తీసుకువచ్చింది. స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వడంలో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ యువతను పోలీసు బలగాలలోకి తీసుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమయింది. భారతదేశాన్ని ఫాసిస్టు నాజీకరణ చేసే ప్రయత్నం ఇది.

మొదటి 90 రోజులలో 46,000 మందిని భర్తీ చేసుకుంటామని, నాలుగేళ్ల పాటు ప్రత్యేక శిక్షణను అందించి అందులో 25 శాతం మందిని సైన్యంలోకి తీసుకుని మిగిలిన 75 శాతానికి మనిషికి 11.71 లక్షల రూపాయలు ఇచ్చి, ఫించన్ వంటి మరే రకమైన సౌకర్యాలూ లేకుండా పంపించివేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నాలుగేళ్ల కాలంలో వారి వేతనాలలో కోత ద్వారా జమ చేసే 5.50 లక్షల రూపాయలకు అంతే మొత్తం ప్రభుత్వం కలుపుతుంది. ఈ పథకంలో శిక్షణ పొందేవారు 'అగ్నివీర్'లంటున్నారు. ఇది ప్రజలపై క్రూర అణచివేతను అమలు చేసే ఎస్‌పీఓ, డీఆర్‌జీ వంటి బలగమే తప్ప మరొకటి కాదు. పైపైనే అయినా దీనిని వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలకు జవాబుగా, యువతను ప్రేరేపించే ప్రయత్నంగా, ఈ 75 శాతాన్ని వివిధ పరిశ్రమలలోకి తీసుకుంటారని, ఈ పథకం ద్వారా దేశంలో సుశిక్షితమైన సైన్యం తయారవుతుందని కేంద్ర మంత్రులు వివిధ రకాలుగా ప్రకటనలు ఇస్తున్నారు. భాజపా పాలిత రాష్ట్ర ప్రభుత్వాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు ఈ శిక్షణ పొంది తిరిగి వచ్చిన వారికి పోలీసు బలగాలలోకి తీసుకునేందుకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించాయి.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్), భాజపాల సిద్ధాంత, భావజాల శిక్షణకు, ఈ రకంగా 'నయా భారత్' పేరుతో భారతదేశాన్ని 'హిందూ రాజ్యం'గా రూపొందించే తమ ఎజెండాకు ఈ పథకం తోడ్పడుతుంది. 'వన్ నేషన్, వన్ ఎవ్రీథింగ్' అన్న నినాదంతో దేశాన్ని ఫాసిస్టు ఏకీకృత పద్ధతిలో రూపొందించేందుకు, దేశంలో కార్మికులు, కర్షకులు, మధ్య తరగతి వంటి పీడిత వర్గాలను, వారికి నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీని, విప్లవకారులను, ప్రశ్నించే ప్రతి గొంతునూ అణచివేసేందుకు ఒక విస్తృత సైన్యం తయారవబోతున్నది. ఇప్పుడీ పథకం దేశాన్ని 'వన్ నేషన్, వన్ పోలీస్' దిశగా తీసుకుపోతుంది.

అత్యంత దూకుడుగా తమ ఎజెండాను ముందుకు తీసుకువెళుతున్న బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు దేశ రాజ్యాంగ నియమాలను కానీ పార్లమెంటరీ వ్యవస్థ నిబంధనలను గానీ పాటించకుండా, కనీస గణతంత్ర స్వభావాన్ని దృష్టిలోకి తీసుకోకుండా కనీసం ప్రతిపక్షాలను సంప్రతించకుండా ఈ పథకాన్ని ప్రకటించాయి. దీని వల్ల కేంద్ర-రాష్ట్ర సంబంధాలు ప్రభావితం అవుతాయి.

ఈ ఫాసిస్టీకరణ పథకం లోతులను అర్థం చేసుకుని దాన్ని ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి, 'అగ్నిపథ్' పథకాన్ని వెనక్కు తీసుకోవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిందిగాను, ఈ పథకానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనోద్యమాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక మహా ఉద్యమంగా మలచవలసిందిగానూ మా పార్టీ కేంద్ర కమిటీ దేశ యావత్తు పీడిత వర్గాలు, పీడిత సెక్షన్‌లు, పీడిత జాతులకు పిలుపునిస్తున్నది. దేశ ప్రజలకు వ్యతిరేకమైనటువంటి 'అగ్నిపథ్'లో చేరవద్దని దేశ యువతకు విజ్ఞప్తి చేస్తున్నది.

Abhay

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**